

బాల్యానికి మూడుముళ్లు


బడిబాట పట్టాల్సిన బాల్యం ఏడు అడుగులతో బంధీ అవుతోంది.. బాల్య వివాహాలతో జీవితానికి చిక్కుముడి పడుతుంది. చిన్నారి పెళ్లి కూతురికి పుస్తెల దండనగా మారుతోంది. 10లో



సుదర్శన హోమానికి విరాళం

సఖినేటిపల్లి : అంతర్వేది నరసన్న ఆలయంలో నిత్య సుదర్శన హోమానికి పోతంశెట్టి సాంబశివ రావు పార్వతి, కృష్ణ రాజేష్ కుటుంబ సభ్యులు (హైదరాబాద్) రూ.40వేల విరాళంగా ఇచ్చారు.

డెల్టా కాలువలకు 9 వేల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలు వలకు శుక్రవారం 9 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. మరో 17.382 క్యూసెక్కులను సముద్రంలోకి వది లారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

దళిత యువకుడిపై వేధింపులు దారుణం



త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న మాజీ ఎంపీ భరత్ రామ్ తదితరులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): దళిత యువకుడిని అక్రమంగా అరెస్టు చేసి, అర్ధనగ్నం గా పోలీస్ స్టేషన్ లాకప్‌లో వేయడం అమాను షమని మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై శుక్రవారం త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ రెండు రోజుల క్రితం పులి సాగర్ అనే యువకుడిని అక్రమంగా అరెస్టు చేసి, ప్రకాశం నగర్ పోలీస్ స్టేషన్ లాకప్‌లో అర్ధనగ్నం గా వేసి, దళితుల మనోభావాలను దెబ్బతీశార న్నారు. రాష్ట్రంలో అక్రమ అరెస్టులు, అమాయకు లపై దాడులు ఎక్కువయ్యాయన్నారు. దళిత యువకుడి మనోభావాలు దెబ్బతినేలా విధంగా ప్రవర్తించిన వారిపై కేసు నమోదు చేసి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేయకపోతే హైకోర్టుకు, జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు, జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. బాధితుడు పులి సాగర్ మాట్లాడుతూ సోషల్ మీడియాలో పెట్టిన ఒక సమస్యను దృష్టిలో పెట్టుకొని పోలీసులు తనపై అమానుషంగా ప్రవర్తించారని ఆవేదన వ్యక్తం చేశాడు. దీనికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని వేడుకున్నాడు. కార్యక్ర మంలో వైఎస్సార్ సీపీ నాయకులు నక్క నగేష్, దాసి వెంకటరావు, కాటం రాజనీకాంత్, సలా సావిత్రి, పోలి విజయలక్ష్మి, గుర్రం గౌతమ్, మజ్జి అప్పారావు, సంకిస భవానీ ప్రియ, తిరగాటి దుర్గ, కొమ్మజి దుర్గారావు, రేగుల నాని, అనంతలక్ష్మి, అనురాధ పాల్గొన్నారు.

డైట్‌లో కళా ఉత్సవ్ 8వ తేదీకి మార్పు

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ్ పోటీలు ఈ నెల 9,10 తేదీలలో జర గనున్నందున బొమ్మూరులోని జిల్లా ప్రభుత్వ విద్యాశిక్షణ సంస్థ(డైట్)లో జరిగే జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీలు ఈ నెల 9వ తేదీకి బదులు 8వ తేదీకి మార్పు చేశారు. పోటీలలో పాల్గొనే వారు ఈ విషయాన్ని గమనించాలని డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎం జయశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు లెక్చ రర్ రాజేష్‌ను 94906 48110 నంబర్‌లో సం ప్రదించాలని సూచించారు.

నేడు 'మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లాలో శని వారం జరుపుకోనున్న 'మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో' విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొనాలని కలెక్టర్ పి.ప్రశాంతి కోరారు. శుక్రవారం ఆమె ప్రకటన విడుదల చేస్తూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, విద్యా ప్రమాణాల స్థాయి మెరుగుపరచేందుకు తీసుకో వలసిన చర్యలను విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చర్చించుకోవడానికి 'మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం' సరైన వేదిక అని పేర్కొన్నారు. జిల్లాలో 988 ప్రాథమిక, ఉన్నత, రెసిడెన్షియల్, గిరిజన ప్రభుత్వ పాఠశాలల్లో ఈ కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. ఉపా ధ్యాయుల పనితీరు, పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనలపై చర్చిస్తారన్నారు. సైబర్ నేరాలపై అవగాహన, పూర్వ విద్యార్థుల విజయగాథలు, అతిథుల ప్రసంగాలు, అభి ప్రాయ సేకరణ ఉంటాయని తెలిపారు.

అధునాతన వైద్య రీతులు అందిపుచ్చుకోవాలి

కాకినాడ క్రైం: ప్లాస్టిక్ సర్జరీలో ప్రపంచ వ్యాప్తంగా అందుబాటులోకి వచ్చిన అధునాతన వైద్య రీతులు అందిపుచ్చుకోవాలని వక్తలు అన్నారు. 21వ రాష్ట్ర స్థాయి సదస్సు శుక్రవారం కాకినాడ కుళాయి చెరువు అవరణలో ఉన్న ఫ్యాబిస్ కన్వెన్ష న్‌లో ప్రారంభమైంది. గ్రామీణ భారతంలో మైక్రోవాస్కులర్ సర్జరీ, ఫేషియల్ ప్లాస్టిక్ సర్జరీ, లైపోడెర్మా మేనేజ్‌మెంట్, అబ్డామినల్ వాల్ రీ కన్‌స్ట్రక్షన్, చీలిక పెదవి పునర్నిర్మాణం, క్యాన్సర్ బాధితుల్లో ప్లాస్టిక్ సర్జరీ అవసరం, దీర్ఘకాలిక గాయాలకు చికిత్స, ఫేషియల్ నర్వ్ పాలసీ, లేజర్ అసిస్టెడ్ బ్లిపరోప్లాస్టీ, జెండర్ డిస్ఫోరియా అంశాలపై వక్తలు ప్రసంగించారు. అనంతరం పీజీలకు క్విజ్ ప్రోగ్రాం నిర్వహించారు. సద స్సులో భాగంగా జనరల్ బాడీ మీటింగ్ నిర్వ హించారు. ఈ సదస్సుకు పర్యవేక్షకుడిగా డాక్టర్ పీవీ సుధాకర్ వ్యవహరించగా ఏపీఆర్ఏఎస్‌సీవో ఎన్ అధ్యక్షుడు డాక్టర్ కృష్ణారెడ్డి చైర్మన్‌గా, ఆర్గనై జింగ్ సెక్రటరీగా డాక్టర్ రత్నభూషణ్ వ్యహరిం చారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావ ణ్యకుమారి ముఖ్య అతిథిగా హాజరై సదస్సును ప్రారంభించారు. జీజీహెచ్ డిప్యూటీ సూపరిం టెండెంట్, ఆర్థోపెడిక్స్ హెచ్ఓడీ డాక్టర్ ఎంపీఆర్ విఠల్, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శశి, సర్జరీ హెచ్‌వోడీ డాక్టర్ ఎస్.శ్రీనివాస్, ఫోరెన్సిక్ హెచ్ వోడీ డాక్టర్ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

జోరుమడులు



దేవరపల్లి మండలం యర్నగూడెంలో బోరు కింద వేసిన వరి ఆకుమడి

- మెట్ట ప్రాంతంలో దాళ్వా వరి సాగుకు సన్నద్ధం
- ముమ్మరంగా నారుమడులు వేస్తున్న రైతులు
- సొసైటీల ద్వారా వరి విత్తనాల సరఫరా
- అధిక దిగుబడులు ఇస్తున్న వంగడాల సాగు
- 48 వేల ఎకరాల సాగు విస్తీర్ణం

దేవరపల్లి: ఖరీఫ్ వరి కోతలు దాదాపు పూర్తి కావ డంతో మెట్ట రైతులు దాళ్వా వరి సాగుకు సన్నద్ధమ వుతున్నారు. సాగుకు అవసరమైన నారుమడులు వేస్తున్నారు. ఒకపక్క ఖరీఫ్ కోతలు, ధాన్యం అమ్మ కాలు జరుగుతుండగా, మరొక పక్క రబీ పంట వేయడానికి సిద్ధమవుతున్నారు. బోర్లు, కాలువల కింద దాళ్వా వరి పంట సాగు జరుగుతుంది. ఖరీఫ్ పంట పూర్తిగా రైతుల చేతికి వచ్చే పరిస్థితి ఉండక పోవడంతో రైతుల ఏటా దాళ్వా పంటపై ఆశలు పెట్టుకుని సాగు చేస్తుంటారు. వరదలు, తుపా నులు, భారీ వర్షాలకు ఖరీఫ్‌లో వేసిన వరి పంట దెబ్బతినడంతో దిగుబడులు అంతంత మాత్రంగా ఉంటాయి. ఎకరాకు 25 నుంచి 30 బస్తాల దిగుబ డులు వస్తున్నాయి. కొంతమంది రైతులకు పెట్టు బడి కూడా రాని పరిస్థితి ఉంది. దాళ్వా పంట రైతుకు లాభసాటిగా ఉంటుంది. మెట్ట ప్రాంతం లోని దేవరపల్లి, నల్లజర్ల, గోపాలపురం మండ లాల్లో బోర్ల కింద దాళ్వా సాగు చేస్తుండగా, తాళ్లపూడి, కొవ్వూరు, చాగల్లు, పెరవలి, ఉండ్రాజ వరం, నిడదవోలు మండలాల్లో కాలువల కింద సాగు చేస్తున్నారు.

అధిక దిగుబడుల వంగడాల సాగు

దాళ్వాలో అధిక దిగుబడులు వస్తున్న వంగడాలను రైతులు సాగు చేస్తున్నారు. ఎంటీయూ 1121, 1153, 1156 వంగడాలు అధిక దిగుబడులు ఇస్తు న్నాయి. వీటిలో ఎంటీయూ 1121 వంగడాన్ని రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఈ వంగడాల పంట కాల పరిమితి 117 నుంచి 120 రోజులు ఉం టుంది. ఎకరాకు 30 నుంచి 35 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. దాళ్వాలో ఎక్కువగా రైతుల నుంచి రైతులు వరి విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం సొసైటీలు, ప్రయివేటు డీలర్ల ద్వారా విత్తనాలను సరఫరా చేస్తున్నప్పటికి అంతగా రైతులు ఆసక్తి చూపడం లేదు.

ముమ్మరంగా ఆకుమడులు

దాళ్వా వరి పంటకు అవసరమైన వరి నారుమ డులను రైతులు ముమ్మరంగా వేస్తున్నారు. బోర్లు, కాలువల కింద ఆకుమడులు వేస్తున్నారు. కొవ్వూరు డివిజన్‌లో సాగుకు అవసరమైన వరి నారుమడులు వేస్తున్నారు. ముందస్తుగా వేసిన ఆకుమడులు ఆశాజనకంగా ఉండడంతో అక్కడ క్కడా రైతులు నాట్లు వేస్తున్నారు. 2,150 ఎకరాల్లో వరి నారుమడులు అవసరం కాగా, ఇప్పటి వరకు 120 ఎకరాల్లో (5 శాతం) నారుమడులు వేశారు.

రైతులకు అందుబాటులో వరి విత్తనాలు



రైతులకు అవసరమైన వరి విత్తనాలను సొసైటీలు, ప్రయివేటు డీలర్ల వద్ద సిద్ధం గా ఉన్నాయి. ఎక్కువగా రైతులు తయారు చేసిన విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు. ఈ నెల ఒకటో తేదీన కాలువకు నీరు విడుదల చేయడం తో పెరవలి, ఉండ్రాజవరం, నిడదవోలు, కొవ్వూరు మండలాల్లో ఆకుమడులు వేస్తున్నారు. మెట్ట ప్రాంతంలో బోర్ల కింద ఆకుమడులు వేశారు. ఖరీఫ్‌లో వరి పండించిన రైతులు రబీలో మొక్కజొన్న పండిస్తున్నారు. దీనివల్ల రబీలో సాగు విస్తీర్ణం తగ్గుతుంది.

– పి.చంద్రశేఖర్, ఏడీఏ, కొవ్వూరు

మరొక 15–20 రోజుల్లో నారుమడులు వేయడం పూర్తవుతుంది.

విత్తన శుద్ధి తప్పనిసరి

వరి నారుమడులు వేసే రైతులు విత్తన శుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలి. 2 గ్రాముల కార్బం డిజంను కిలో విత్తనంలో కలిపి విత్తన శుద్ధి చేసు కోవాలి. చలి ఎక్కువగా ఉన్నందున ఎకరాకు 150 కిలోల సింగిల్ సూపర్ ఫాస్పేట్, 25 కిలోల పొటాషియం, 25 కిలోల నత్రజని ఎరువును వరినాట్లు వేసే ముందు రోజు ఆఖరి దుక్కిలో వేసుకొంటే చలిని తట్టుకుని పంట ఆశాజనకం గా ఉంటుంది. విత్తన శుద్ధి వల్ల మొలక శాతం బాగుంటుంది. కొవ్వూరు డివిజన్‌లోని తొమ్మిది మండలాల్లో 48 వేల ఎకరాల్లో వరి సాగు జరు గుతోంది.



దేవరపల్లి మండలం త్యాజంపూడిలో వరి ఆకుమడి వేయడానికి దమ్ము చేస్తున్న రైతు

హోంగార్డ్స్ పోలీస్ శాఖలో అంతర్భాగం

ఎస్పీ నరసింహకిశోర్



హోంగార్డ్స్ ఆవిర్భావ దినోత్సవంలో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహకిశోర్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): హోం గార్డ్స్ పోలీసు శాఖలో అంతర్భాగమని జిల్లా ఎస్పీ డి.నరసింహకిశోర్ అన్నారు. 62వ హోం గార్డ్స్ ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం పోలీసు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన హోంగార్డ్స్ రైజింగ్ డే పరేడ్‌కు ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హోంగార్డులు నిస్వార్థ సేవలు అందిస్తున్నారని, పోలీస్ శాఖలో వారి సేవలు కీలకమన్నారు. వీరిలో కొంతమంది చదువుకు న్నవారు పోలీస్ స్టేషన్‌లో టైపిస్టులు, కంప్యూ టర్ విభాగంలో పనిచేయడం హర్షించదగ్గ విష యమన్నారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో పని చేసి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాల న్నారు. భవిష్యత్తులో అంకిత భావం, మంచి సేవా దృక్పథంతో ముందుకు సాగి ప్రజల మన్నలను పొందాలన్నారు. హోంగార్డ్స్‌తో ఎస్పీ ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి సాధక బాధ లను, ఆర్థిక స్థితిగతులను, ఆరోగ్య పరమైన విషయాలను, విధుల్లో ఉన్న ఇబ్బందులను తెలుసుకొని వారి సమస్యల పరిష్కార దిశగా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అడిషనల్ ఎస్పీలు అల్లూరి వెంకట సుబ్బరా జు, ఎన్‌బీఎం మురళీకృష్ణ, అడిషనల్ ఎస్పీ ఎల్.చెంచిరెడ్డి, జోనల్ డీఎస్పీలు, సర్కిల్ ఇన్ స్పెక్టర్లు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మహనీయుడు అంబేడ్కర్

మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, డాక్టర్ గూడూరి



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజా, గూడూరి శ్రీనివాస్ తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): దేశానికి గొప్ప రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ అని వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. స్థానిక తిలక్ రోడ్డు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం రాజమహేంద్రవరం వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 68వ వర్ధంతి నిర్వహించారు. జక్కంపూడి రాజా ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లా డుతూ అంబేడ్కర్ ఆశయాలు, ఆలోచనా విధా నాలు వేల సంవత్సరాలు మనలో ఉంటాయని అన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా నాడు జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తే, నేడు అధికా రంలో ఉన్న కూటమి ప్రభుత్వం అంబేడ్కర్ ఆశ యాలకు తూట్లు పొడుస్తోందన్నారు.

కూటమి ప్రభుత్వానికి ప్రజలు ఎంతో నమ్మ కంతో అధికారమిస్తే ప్రజలను అణగదొక్కుతున్నా రని, వేలాది మందిపై అక్రమ కేసులు బనాయించి భౌతిక దాడులకు పాల్పడుతున్నారన్నారు. అంబే డ్కర్ ఆశయాలకు అనుగుణంగా పాలన చేయ కపోతే ప్రజలు తిరుగుబాటు చేసి కూటమి ప్రభు త్వానికి చరమగీతం పాడతారని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా ఎన్నికలలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం విజయవాడ నడిబొడ్డున డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. డాక్టర్ గూడూరు శ్రీనివాస్ మాట్లాడుతూ అంబేడ్కర్ రాజ్యాంగం ద్వారా అందరికీ సమాన హక్కు కల్పించారని పేర్కొన్నారు. అలాంటి రాజ్యాంగాన్ని కూటమి ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శించారు. రాజ్యాంగ హక్కులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పిలుపు ఇచ్చారు. వైఎ స్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి రాధిక, మాజీ కార్పొరేటర్లు మజ్జి అప్పారావు, వాక చర్ల కృష్ణ, ప్రసాద్, నాయకుడు ఆరిఫ్ పాల్గొన్నారు.

నేడు సుబ్రహ్మణ్య షష్ఠి

బిక్కవోలులో భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు పూర్తి

బిక్కవోలు: షష్ఠి సందర్భంగా బిక్కవోలు శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఆలయం వద్ద ఏర్పాట్లు దాదాపుగా పూర్తి కావచ్చాయి. శుక్రవారం రాత్రి 1.20 గంటలకు (తెల్లవారితే శనివారం) స్వామి వారి తీర్థపు బిందె సేవతో షష్ఠి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. అనంతరం డోలు, సన్నాయి, బ్యాండ్ కచేరీ నిర్వహిస్తారు. శనివారం ఉదయం 11 గంటల నుంచి 4 గంటల వరకు దొడ్డిపట్ల, మొగల్తూరు, ఉండ్రాజవరం, బిక్కవోలు గ్రామాల బ్యాండ్ పార్టీల కచేరీలు సాగుతాయి. అనంతరం 4 గంటల వరకు పగటి పూట బాణసంచా కాల్పులు ఉంటాయి. 4.30 నుంచి రాత్రి 9 గంటలకు వరకు భక్తి రంజన సాంస్కృతిక కార్యక్రమాలు, 9 గంట లకు రాత్రి స్వామి వారి గ్రామోత్సవం నిర్వహిస్తారు. భారీ బ్యాండ్ మేళాలు, కోయ డ్యా న్సులు, గరగ నృత్యాలు, కోలాహలంగా సాగు తాయి. రాత్రి 11 గంటల నుంచి తెల్లవారే వరకు బాణసంచా కాల్పు ఉంటుంది. భక్తుల రద్దీ దృష్ట్యా జాగ్రత్తలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా బయట గ్రామాల నుంచి 50 మంది సిబ్బందిని తీసుకు వచ్చినట్టు తెలిపారు. స్నానఘట్టాలలో ఎల్ఈడీ బల్బులను ఏర్పాటు చేశారు. ఆలయంలో ప్రవేశిం చే భక్తులకు అసౌకర్యం కలగకుండా బ్యారికేడ్లను ఏర్పాటు చేశారు. ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శిబి రాన్ని ఏర్పాటు చేసినట్టు వైద్యాధికారి దుర్గాదేవి తెలిపారు. బందోబస్తుకు 300 మంది పోలీసులను వినియోగిస్తున్నారు.



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి అలంకరణలో విద్యుత్ దీప కాంతులు

ఆమెకు కోపం వచ్చింది!

- 'సాక్షి'కి సమాచారం ఇచ్చిందెవరు? అని ఆగ్రహం
- వలస మహిళా నాయకురాలి పెత్తనంపై టీడీపీ నేతల అసంతృప్తి

రాజమహేంద్రవరం రూరల్: మహిళా సంఘాల సభ్యులకు టీడీపీ సభ్యత్వం టార్గెట్‌లు ఇస్తున్న మహిళా నాయకురాలి విషయం 'ఆమె దూకుడు పెంచారు' శీర్షికన సాక్షి వెలుగులోకి తీసుకువ చ్చిన విషయం విదితమే. అయితే రాజమహేం ద్రవరం రూరల్ మండలంలో ఆర్‌పీలకు, వీఏఓ లకు సభ్యత్వ టార్గెట్‌లు పెడుతున్న విషయాన్ని 'సాక్షి'కి ఎవరు చెప్పారంటూ ఆ మహిళా నాయ కులు ఆరా తీయడం మొదలు పెట్టినట్టు సమా చారం. సిటీకి చెందిన ఆ నాయకురాలు రూరల్‌లో పెత్తనం చలాయించడం ఒక ఎత్త యితే, తాను చెప్పిన విషయాలను మీడియాకు ఎవరు లీక్ చేస్తున్నారంటూ ఆర్‌పీలు, వీఏఓలపై ఆగ్రహం వ్యక్తం చేయడం ఇంకొక ఎత్తుగా రూర ల్‌లో చర్చ సాగుతోంది. నియోజకవర్గ ముఖ్య నాయకుడు తమ ప్రియ శిష్యురాలి పెత్తనాన్ని పట్టించుకోకపోవడంతో సదరు నాయకురాలు ఆడింది ఆటగా మారిందని టీడీపీ నాయకులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ముఖ్య నాయకుడి రాజకీయ వారసుడిని కూడా పక్కన పెట్టి పలు కార్యక్రమాలను ఈవిడే నిర్వహించే స్తుండడం పట్ల టీడీపీ కేడర్ గుర్రుగా ఉన్నట్లు తెలుస్తోంది. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను ముఖ్యనాయకుడిని నేరుగా కలవనీయకుండా, మహిళా నేతే అన్నీ తానై వ్యవహారాలు నడిపిస్తుం డడం కూడా అసంతృప్తిని పెంచుతోందంటు న్నారు. అవకాశం కోసం చూస్తున్న వారంతా 'సాక్షి' వెలుగులోకి తీసుకువచ్చిన విషయాన్ని పార్టీ అధిష్టానానికి చేర వేసినట్లుగా సమాచారం. ఈవిడ పెత్తనం ఇలాగే కొనసాగితే పార్టీకి నష్టమని అధిష్టానానికి విన్నవించుకున్నట్లుగా చెబుతున్నారు. దీంతో వలస మహిళా నాయ కురాలి పాత్రపై పార్టీ పెద్దలు కూడా దృష్టి సారిం చారంటున్నారు.

అసలే ప్రభుత్వంపై వ్యతిరేకత

కూటమి నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీ లను అధికారంలోకి వచ్చాక పూర్తి స్థాయిలో అమలు చేయ లేదు. దీంతో ఇప్పటికే క్షేత్రస్థా యిలో ప్రజల్లో వ్యతిరేక భావన కన్పిస్తోంది. గతంలో వైఎస్సార్ సీపీ అధికారంలో ఉండగా ఏదో ఒక పథకం ప్రతి నెలా లబ్ధిదారులకు చేరేది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు కావస్తున్నప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పట్టించుకోకపోవడంపై జనాల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత కనిపిస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో పార్టీ నుంచి సభ్యత్వ నమోదు అంటూ ఒత్తిడి పెంచితే మరింత వ్యతిరేకతను మూటగట్టుకో వాల్సి వస్తుందని, అందుకు బాధ్యులుగా నిలు స్తున్న వారిని నియంత్రించాలని పార్టీ అధిష్టానా నికి రూరల్ నాయకులు మొర పెట్టుకున్నట్లుగా చెబుతున్నారు. వీరి మొరను ఆలకించి పైవారు ఏం చర్యలు తీసుకుంటారో చూడాలి.

కాకినాడ జీజీహెచ్ మేనేజర్ సస్పెన్షన్‌కు నిర్ణయం

ఆర్‌డీకి కలెక్టర్ ఆదేశం



కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్ మేనేజర్ వైవీ ఎస్ఎన్ నరసింగరా వును తక్షణమే సస్పెండ్ చేయాలని రీజినల్ డైరె క్టర్ డాక్టర్ పద్మాశశిధర్ కలెక్టర్ షణ్మోహన్ ఆదే శించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఆదేశాలిచ్చారు. నర్సింగ్ పోస్టుల విక్రయానికి పాల్పడ్డ నరసింగరావు అర్హు లైన నర్సుల అవకాశాలను తొక్కిపెట్టినట్టు అభి యోగం. నాన్ లోకల్ అభ్యర్థులను లోకల్‌గా కలెక్టర్ కార్యాలయాన్నే తప్పుదోవ పట్టించడమే కాక అప్పటి కలెక్టర్, సిబ్బంది తనకు సహకరించారని ఆరోపణలు చేశారు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న కలెక్టర్ షణ్మోహన్ విచారణకు ఆదేశిం చారు. అందులో నరసింగరావు చేసిన ఆరోపణలు అన్నీ అవాస్తవాలని తేలాయి. ప్రస్తుతం అందుబా టులో లేని అధికారులపై నెపం నెట్టి తాను తప్పిం చుకోవాలనే పన్నాగం పన్నారనే విషయం నిర్ధారణ అయింది. దీంతో వివరణ ఇవ్వాలని కలెక్టర్ నరసిం గరావుకు మెమో జారీ చేశారు. ఇందుకు నరసింగ రావు స్పందించలేదు. ఈ నేపథ్యంలో నరసింగరా వును సస్పెండ్ చేయాలని కాంపిటెంట్ అథారిటీ అయిన రీజినల్ డైరెక్టర్(ఆర్‌డీ) పద్మాశశిధర్‌ని కలె క్టర్ ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలు అందాయనీ శనివారం సస్పెన్షన్ చర్యలు తీసుకోబోతున్నట్లు ఆర్‌డీ డాక్టర్ పద్మాశశిధర్ తెలిపారు.

దైవబలం గొప్పది

శ్రీ మద్భాగవత సప్తాహంలో అహోబిల రామానుజ జీయర్ స్వామి



రామానుజ జీయర్ స్వామి

రాజమహేంద్రవరం రూరల్: ఈ లోకంలో యుక్తి, బుద్ధి, ధన బలాల కంటే దైవబలమే గొప్పదని శ్రీ శ్రీ శ్రీ త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి అభిభాషించారు. ఎవరు దైవబలం కలిగి ఉంటారో వారే గొప్ప బలం గలవారన్నారు. రాజ వోలు గాయత్రీనగర్‌లో రామాలయం దగ్గర శ్రీ శ్రీ శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్ స్వామి మంగళాశాసనాలతో ప్రతిరోజూ సాయంత్రం 5గం టల నుంచి 7గంటల వరకు శ్రీ మద్భాగవత సప్తాహ ప్రవచనాలలో భాగంగా మూడవరోజు శుక్రవారం అహోబిల రామానుజ జీయర్ స్వామి ప్రవచనం చేశారు. కర్దముడి గురించి ఆయన వివరించారు. మనువు భార్యాకుమార్తెలతో వచ్చి, తన కుమార్తె దేవహూతిని వివాహం చేసుకోవాలని కోరగా, సంతానం కలగగానే వెళ్లిపోతానని, అం దుకు సమ్మతిస్తేనే వివాహం చేసుకుంటానని కర్దముడు చెప్పడంతో దానికి దేవహూతి అంగీకరిం చడంతో వారిద్దరి వివాహం అయిందని వివరిం చారు. అయితే వేల సంవత్సరాలు తపస్సు చేసిన తనకు సపర్యలు చేసి చిక్కి శల్యమైన అర్ధాంగికి ఆమె కోరిక ప్రకారం సంతాన యోగం కల్గించ డానికి కర్దముడు అంగీకరించాడని, సంతానం కల్గించిన తర్వాత కర్దముడు సన్యసించి, వెళ్లిపోవ డానికి కూడా నిర్ణయం అయిందని వివరించారు. ఫలితంగా కర్దముని తపోశక్తి వలన దేవహూతికి యవ్వన సౌందర్యం, సకల సౌకర్యాలు వచ్చాయని వివరించారు. ముఖ్యంగా సకల భోగాలు అనుభ వించడానికి నిత్య శుద్ధిగల విమానంలో ఆనందం గా వారు విహరించారని స్వామి తెలిపారు. ధనం వలన వచ్చే శక్తి కంటే జనార్దన నామంతో వచ్చే శక్తి అపారమైనదని ఆయన చెప్పారు. అయితే తపోశక్తి వలన వచ్చే శక్తిని వృథా చేయరాదన్నారు. కళ, అన సూయ, శ్రద్ధ, హవిర్భువు, గతి, క్రియ, ఖ్యాతి, అరుంధతి, శాంతి అనే తొమ్మిది మంది ఆడపిల్లలు జన్మించారని వివరించారు. అయితే సత్పురుషుడైన భర్త వలన సంతానం కోరడం కాకుండా ఆత్మజ్ఞానం పొందాల్సిందని దేవహూతి గ్రహించి, మరి భర్త వెళ్లిపోతే తనకు తత్వం బోధించేదెవరని, అంతటి శక్తి గల పుత్రుణ్ణి ఇవ్వాలని కోరడంతో ఆమె కోరిక ప్రకారం ఆ శ్రీ మహావిష్ణువే కపిల మహర్షిగా జన్మించాడని ఆయన వివరించారు. స్వయంగా బ్రహ్మ వచ్చి ఆశీర్వదించడమే కాకుండా తన పుత్రులైన మహర్షులను ఇచ్చి, తొమ్మిది మంది ఆడపిల్లలకు వివాహం జరిపించాడని ఆయన తెలిపారు.

క్లుప్తంగా

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

మధురపూడి: ఎరువులు, **పురుగు మందుల** దుకాణదారులు నిబంధ**నలను పాటించక** పోతే చర్యలు తప్పవని **విజిలెన్స్, ఎన్‌ఫోర్స్** మెంట్ అధికారి ఎం.స్నే**హిత అన్నారు. శుక్ర** వారం కోరుకొండ మండల**ం గాడాలలోని లక్ష్మీ** గణేష్ ట్రేడర్స్, ఫెర్టిలై**జర్స్ దుకాణంలో** రూ.4,85,271 విలువైన 21,900 మెట్రిక్ టన్నుల ఎరువులను విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సీజ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఈ ఎరువులను వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ దుకాణంలోని ఎనిమిది రకాల ఎరువుల్లో వ్యత్యాసం ఉండడంతో షాపు యజమానిపై 6–ఏ కింద కేసు నమోదు చేశామని తెలిపారు.

యాసిడ్ తాగిన యువకుడు

రాజమహేంద్రవరం రూరల్: ఓ బాలికను ప్రేమించి వివాహం చేసుకున్న యువకుడిని పోలీసులు మందలించడంతో పాటు బాలిక తల్లి ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ, పోక్సో కేసు నమోదు చేయడంతో మనస్తాపం చెందిన అతడు యాసిడ్ తాగిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బొమ్మూరు జేఎల్‌బీ నగర్‌కు చెందిన బాలిక(14) స్థానిక పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతుంది. ఆ బాలిక, బొమ్మూరు వాంబే కాలనీకి చెందిన కిల్లారి చందు (21) ప్రేమించుకున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 4న అన్నవరంలో ఇద్దరూ వివాహం చేసుకున్నారు. ఈ విషయం తెలిసిన బాలిక తల్లి శుక్రవారం ఉదయం పోలీసులను ఆశ్రయించింది. దీంతో బొమ్మూరు పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ ఇరువురు పెద్దలను పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. బాలికను వివాహం చేసుకోవడం చట్టరీత్యా నేరమని ఆ యువకుడిని పోలీసులు గట్టిగా మందలించారు. అనంతరం బాలిక తల్లి ఫిర్యాదు మేరకు సదరు యువకుడిపై ఎస్సీ, ఎస్టీ, పోక్సో కేసు నమోదు చేశారు. దీంతో తీవ్ర మనస్తాపం చెంది ఇంటికి వెళ్లిన యువకుడు మధ్యాహ్నం యాసిడ్ తాగి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. అతడిని చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

తాళ్లపూడి: ఇంటి వద్ద పనులు చేసుకుంటున్న ఓ మహిళ మెడలోని మంగళ సూత్రాల తాడును గుర్తు తెలియని వ్యక్తి తెంచుకుని పరారయ్యాడు. ఈ ఘటన శుక్రవారం అన్నదేవరపేటలో జరిగింది. ఆ గ్రామ బీసీ కాలనీకి చెందిన పట్నాల ఉమామహేశ్వరరావు భార్య లక్ష్మి తన ఇంటి వద్ద పెరట్లో పనులు చేసుకుంటుంది. బాత్‌రూమ్ వెనుక వైపు నుంచి గుర్తు తెలియని వ్యక్తి వచ్చి ఒక్కసారిగా ఆమె మెడలోని బంగారు మంగళ సూత్రాల తాడును తెంచుకుని పోయాడు.

బాల్యానికి మూడుముళ్లు



- బడిబాట వయసులో వివాహాలు
- కుటుంబ బాధ్యతలతో చితికిపోతున్న బాలికలు
- యువతికి 18, యువకుడికి 21 ఏళ్లు నిండాల్సిందే
- బాల్య వివాహాల నిర్మూలనకు టోల్‌ఫ్రీ నంబర్ '1098'

జిల్లా	సంవత్సరం	రిపోర్టు చేసిన బాల్యవివాహాలు	ఆపిన పెళ్లిలు	ఎఫ్ఐఆర్ నమోదు చేసినవి
ఉమ్మడి తూర్పుగోదావరి	2019–20	162	161	1
ఉమ్మడి తూర్పుగోదావరి	2020–21	148	145	3
ఉమ్మడి తూర్పుగోదావరి	2021–22	144	144	–
కాకినాడ	2022–23	50	50	–
కాకినాడ	2023–24	40	37	1

కాకినాడ సిటీ: బడిబాట పట్టాల్సిన బాల్యం ఏడు అడుగులతో బందీ అవుతోంది.. బాల్య వివాహాలతో జీవితానికి చిక్కుముడి పడుతుంది. చిన్నారి పెళ్లి కూతురికి పుస్తెల దండనగా మారుతోంది. పుస్తకాలు పట్టాల్సిన బాలికలు కుటుంబ బాధ్యతలు మోయాల్సిన పరిస్థితి వస్తోంది. పట్టుమని 15 ఏళ్లు నిండని బాలిక భార్యగా, తల్లిగా బాధ్యతలు మోస్తుంది. పేదరికం ఒకవైపు, ఆడపిల్ల భారం తీరుతుందని కన్నవాళ్లే సంసారం అనే సాగరంలోకి నెట్టేయడం ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. 18 ఏళ్లు నిండకుండా వివాహాలు చేస్తే అనారోగ్యం పాలవుతారని వైద్యులు హెచ్చరిస్తున్నా పెడచెవిన పెడుతున్నారు. బాల్య వివాహాలు నేరమని, బాలికలు మానసికంగా, శారీరకంగా సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని అధికారులు అవగాహన కల్పిస్తున్నా మార్పు మాత్రం కనిపించడం లేదు. బాలికల తల్లిదండ్రులకు అక్షరజ్ఞానం, సమాజం పట్ల అవగాహన లేకపోవడం, కుమార్తెకు పెళ్లి చేస్తే భారం తగ్గుతుందనే ఆలోచన, పిల్లలు ప్రేమ వైపు ఆకర్షితులైతే కుటుంబ పరువు పోతుందనే భయంతో బంగారు భవిష్యత్తుకు మాంగల్య బంధనం వేస్తున్నారు. పెళ్లంటే ఏమిటో తెలియని వయసులో అత్తారింటికి సాగనంపుతున్నారు.

అడ్డుకునే అధికారం అందరిదీ

బాల్య వివాహాలను అడ్డుకునే అవకాశం గ్రామ స్థాయిలో వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, సీడీపీవో, మండల స్థాయిలో తహసీల్దార్, రెవెన్యూ డివిజన్ స్థాయిలో ఆర్డీఓలకు ఉంది. ఐసీడీఎస్ తప్ప ఇతర శాఖల అధికారులు దీనిపై దృష్టి సారించడం లేదనే విమర్శలున్నాయి. బాల్య వివాహాలపై ఎవరైనా 1098కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చు. సమగ్ర బాలల పరిరక్షణ పథకం కింద ఐసీడీఎస్ ప్రాజెక్టు స్థాయిలో అంగన్‌వాడీ కార్యకర్తలు మండల సమాఖ్య, సంరక్షణ అధికారుల సమన్వయంతో బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేస్తున్నారు. ఈ ఏడాది నుంచి గ్రామ, వార్డు సచివాలయ పరిధిలో ఉన్న క్షేత్రస్థాయి సిబ్బందికి అధికారులు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నారు. కాకినాడ జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఐదేళ్లలో 544 బాల్య వివాహాలు అడ్డుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో 537 బాల్య వివాహాలు జరగకుండా ఆపారు. ఏడుగురిపై కేసులు పెట్టారు. అధికారుల దృష్టికి రాకుండా జరిగిపోతున్న పెళ్లిళ్లు అనేకం ఉంటున్నాయి.

వివాహ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

బాల్య వివాహాలను అరికట్టేందుకు అధికారులు ప్రత్యేక ప్రణాళిక చేపట్టారు. జిల్లాలోని అన్ని రెవెన్యూ డివిజన్, ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో సీడీపీఓలు వివాహ రిజిస్ట్రేషన్ చట్టం–2002 అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామ, వార్డు స్థాయిలో మహిళా సంరక్షణ కార్యదర్శుల ద్వారా వివాహ రిజిస్ట్రేషన్లు తప్పనిసరిగా చేయించుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. సంతకం చేసిన దరఖాస్తు ఫారం, నివాస ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, రెండు ఫోటోలు వివాహ పత్రికతో సంబంధిత రిజిస్ట్రేషన్ ఆఫీసులో దరఖాస్తు చేసుకోవాలి. తప్పుడు పత్రాలు సమర్పిస్తే జైలు శిక్షతో పాటు జరిమానా విధించాలనే నిబంధనలు ఉన్నాయి.

పడే శిక్షలు ఇవే..

బాల్య వివాహం చట్టరీత్యా నేరం. పెళ్లి చేసినా, ప్రోత్సహించినా రెండేళ్ల వరకూ జైలు శిక్ష, రూ. లక్ష జరిమానా పడుతోంది. బాల్య వివాహాల నిర్మూలన, బాలల సంరక్షణ కోసం 1098 టోల్‌ఫ్రీ నంబర్ అందుబాటులో ఉంది. సమాచారం అందిస్తే సంబంధిత అధికారులు ఆ వివాహాన్ని అడ్డుకుని తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు 18 ఏళ్లు నిండే వరకూ బాలికకు వివాహం చేయబోమని ఒప్పంద పత్రం రాయించుకుంటారు.

జరిగే ముప్పు ఇది..

- బాల్య వివాహాలతో అనేక ప్రమాదాలు సంభవిస్తాయి. బాలికల్లో శారీరక, మానసిక ఎదుగుదల ఉండదు. వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం ఉంటుంది.
- చిన్న వయసులో గర్భం దాల్చే బాలికల్లో గర్భస్రావం ముప్పు ఎక్కువ.
- శిశు మరణాలతో పాటు తల్లుల ప్రాణాలు సంభవించే అవకాశం ఉంటుంది.
- పుట్టిన బిడ్డ తక్కువ బరువుతో ఉంటారు. భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలు వస్తాయి.
- 60 శాతం బాలికల్లో రక్తహీనత ఉంటుంది. ఈ క్రమంలో గర్భం దాల్చడం మంచిది కాదు.

సమాచారం ఇవ్వండి



ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వండి. పోలీసు, రెవెన్యూ, చైల్డ్‌లైన్ 1098 ద్వారా వాటిని అడ్డుకుంటాం. బాల్య వివాహాల కారణంగా జరిగే నష్టాలను వివరిస్తున్నాం. బాల్య వివాహాల నిర్మూలనపై అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచనలు ఇచ్చాం.

–కె.ప్రవీణ, ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు అధికారి, కాకినాడ

ప్రాణాలకే ముప్పు



చిన్న వయసులో గర్భం దాల్చడం వల్ల బాలికలు ఎనీమియా బారిన పడే ప్రమాదం ఉంది. ప్రసవం సమయంలో అధిక రక్తస్రావం, అధిక రక్తపోటుతో మరణాలు సంభవిస్తాయి. బిడ్డను మోసే సామర్థ్యం బాలికలకు తక్కువగా ఉంటుంది. దీంతో బిడ్డతో పాటు తల్లికీ ప్రమాదమే.

–జె.నరసింహనాయక్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి

అందరూ బాధ్యులే..



బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం. బాల్య వివాహం జరిపించిన తల్లిదండ్రులు, సంరక్షకురాలు, అనుమతించిన పెద్దలు, పెళ్లికి సహకరించిన అందరూ నేరస్తులే అవుతారు. బాలికను పెళ్లి చేసుకుని సంసారం చేస్తే పోక్సో కేసు నమోదవుతుంది.

–రఘువీర్ విష్ణు, డీఎస్పీ, కాకినాడ

దారి చూపు స్వామీ..

- మెట్ల దారికి అడ్డుగా వాహనాల పార్కింగ్
- అన్నవరంలో పట్టించుకోని అధికారులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గమ్మ ఆలయం వద్ద మెట్ల దారికి అడ్డుగా వాహనాలు నిలిపేస్తుండడంతో రాకపోకలు సాగించే భక్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సత్యదేవుని ఆలయానికి చాలా మంది మెట్లదారి నుంచి వస్తుంటారు. వీరు వనదుర్గ అమ్మవారి ఆలయం వరకూ ఏ ఇబ్బంది లేకుండా వస్తున్నారు. ఈ ఆలయం పక్కన హోమ మండపం వద్ద వాహనాలను మెట్లదారికి అడ్డుగా పెడుతుండడంతో ఆలయానికి ఎలా వెళ్లాలో తెలియక భక్తులు అవస్థలు పడుతున్నారు. చివరికి ఆ వాహనాల పక్కన ఖాళీ లోంచి వెళ్లాల్సి వస్తోంది. శుక్రవారం కూడా ఇదే విధంగా అడ్డుగా వాహనాలు నిలిపివేయడంతో భక్తులు, చండీ హోమానికి హాజరైన వారు తీవ్ర ఇబ్బంది పడ్డారు. రత్నగిరిపై చాలా చోట్ల పార్కింగ్ స్థలాలు ఉన్నాయి. అయినప్పటికీ కొంతమంది తమ వాహనాలను మెట్ల దారికి అడ్డుగా నిలిపివేస్తున్నారు. ప్రతి శుక్రవారం వనదుర్గమ్మ ఆలయంలో జరిగే చండీ హోమం, పౌర్ణమి, అమావాస్యకు జరిగే ప్రత్యంగిర హోమాల్లో పాల్గొనే భక్తులు కూడా దీనివల్ల తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అయినా దేవస్థానం సెక్యూరిటీ సిబ్బంది పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.




వనదుర్గమ్మ ఆలయం వద్ద మెట్ల దారికి అడ్డుగా నిలిపిన కార్లు

శంఖాన్ని పూరించి.. శివయ్యను పిలిచి

- ఎస్‌పీఎఫ్ కమాండెంట్ దంపతుల శంఖనాదం సాధన
- రేపు కామధేను జాతీయ పురస్కారం ప్రదానం

రాజమహేంద్రవరం రూరల్/పి.గన్నవరం: శివయ్యను ప్రసన్నం చేసుకునేందుకు భక్తులు అనేక మార్గాలను అనుసరిస్తారు.. శంఖాన్ని ఏకబిగిన పూరిస్తూ మహాదేవుడిని ఆనందింపజేస్తారు మరికొందరు.. శ్వాసను బిగించి ఏకధాటిగా దాదాపు ఇరవై నిమిషాల పాటు శంఖాన్ని పూరిస్తూ తమ భక్తిని ప్రదర్శిస్తున్న ఎస్‌పీఎఫ్ కమాండెంట్ నరసింహారావు, అలివేలు మంగాదేవి దంపతులకు ఆధ్యాత్మిక సంపూర్ణత్వంతో పాటు, భౌతికంగా కూడా అవార్డులు వరిస్తున్నాయి. వీరు చేసే ఆధ్యాత్మిక సేవ అవార్డుల కోసం కాకపోయినప్పటికీ శంఖనాదంలో వీరి నిపుణతకు హైదరాబాద్‌కు చెందిన విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ కామధేను–2024 అవార్డ్స్‌లో భాగంగా జాతీయ పురస్కారానికి ఎంపిక చేసింది. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమంలో నరసింహారావు దంపతులు ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. ఈ సందర్భంగా తమ ఆధ్యాత్మిక మార్గం, శంఖునాదం సాధన గురించి నరసింహారావు మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం తమ స్వగ్రామమని అన్నారు. ప్రస్తుతం రాజమహేంద్రవరంలో ఏపీ ప్రత్యేక రక్షణ దళం (ఏపీఎస్‌పీఎఫ్) కమాండెంట్‌గా విధులు నిర్వహిస్తున్నానన్నారు. తన భార్య అలివేలు మంగాదేవి గృహిణి అని, తమకు శివుడు అంటే ఎనలేని భక్తి అని చెప్పారు. తాను 1989లో పశ్చిమ బెంగాల్ సిలిగురి ప్రాంతంలో సరిహద్దు భద్రత దళంలో పనిచేసే సమయంలో బెంగాలీ పూజారి చక్రవర్తి వద్ద శంఖం పూరించడంలో మెలకువలు నేర్చుకున్నానని వివరించారు. అదే స్ఫూర్తితో తన భార్య మంగాదేవి పట్టు సాధించారన్నారు. దీంతో తమకు 'అఖండ శంఖారావ యుగళం'గా పేరొచ్చిందన్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు, కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో 35 సంవత్సరాలుగా సొంత ఖర్చులతో ఇంత వరకూ నాలుగు వేలకు పైగా కార్యక్రమాలు తమ శంఖారావంతో ఆరంభమయ్యాయని అన్నారు. గోదావరి, కృష్ణా పుష్కరాలు, ఇబ్రహీంపట్నం పవిత్ర నదీ సంగమ అనుసంధానం వంటి పెద్ద కార్యక్రమాల్లో శుభసూచికంగా అఖండ శంఖారావం పూరించామన్నారు. ఈ సందర్భంగా పలు సంస్థల నుంచి గౌరవ డాక్టరేట్లు, అవార్డులు, మంత్రుల చేతుల మీదుగా సత్కారాలు, సువర్ణ ఘంటాకంకణాలు లభించాయన్నారు. ఇదంతా కేవలం సాధనతోనే సాధ్యమైందని, పదేళ్ల పాటు దీన్ని సాధన చేశామని నరసింహారావు దంపతులు పేర్కొన్నారు.



తిరుపతిలో శంఖం పూరిస్తున్న ఎస్‌పీఎఫ్ కమాండెంట్ నరసింహారావు, అలివేలు మంగాదేవి దంపతులు (ఫైల్)

రేపు 'శ్రీషిర్డీసాయి'లో అవగాహన సదస్సు

కడియం: పదో తరగతి విద్యార్థులకు శ్రీషిర్డీసాయి విద్యా సంస్థల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు, మెగా స్కాలర్‌షిప్ టెస్ట్‌ను 8వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ టి.శ్రీవిద్య తెలిపారు. దివాన్‌చెరువు బీజాపురి క్యాంపస్‌లో ఈ సదస్సు జరుగుతుందన్నారు. ఇంటర్‌తోపాటు, జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్, ఎయిమ్స్ ఐపీ, మాట్, క్లాట్, సివిల్స్ వంటి ఇంటిగ్రేటెడ్ కోర్సులపై నిపుణులు ఈ సదస్సులో అవగాహన కల్పిస్తారన్నారు. అలాగే విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తారని వివరించారు. ఇంటర్‌లో ఐఐటీ ఓరియంటేషన్ కోర్సు కోసం ఎల్–సాట్, నీట్ ఓరియంటేషన్ కోసం ఎం–సాట్ విభాగాల్లో పరీక్ష నిర్వహించి, అర్హులకు స్కాలర్‌షిప్ అందించనున్నట్లు శ్రీవిద్య చెప్పారు. ఈ అవకాశాన్ని 10వ తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సంస్థ చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్ కోరారు. ఇతర వివరాలకు 95812 61119 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

గంజాయి స్మగ్లింగ్‌పై ప్రత్యేక నిఘా

ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్

నిడదవోలు: జిల్లాలో గంజాయి నిర్మూలనకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా నిడదవోలు పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. ముందుగా పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం పలు రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లాలో గోకవరం, కోరుకొండ, రాజమహేంద్రవరం ప్రాంతాల్లో గంజాయి విక్రయాలపై నిఘా పెట్టామన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి రాజమహేంద్రవరానికి వచ్చి ఏజెన్సీ ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన గంజాయి విక్రయిస్తున్నారన్నారు. దీనిపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించి గంజాయి వ్యాపారులను పట్టుకుంటున్నామన్నారు. ఒడిశా, వైజాగ్ పోలీసులను సమన్వయం చేసుకుని సమాచారం సేకరించి స్మగ్లర్ల కదలికలపై పూర్తి స్థాయిలో నిఘా పెట్టామన్నారు. పోలీస్ సిబ్బంది కొరతను అధిగమించేందుకు రాష్ట్రంలో త్వరలో పోలీస్ రిక్రూట్‌మెంట్ జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది కొరత ఉన్నా ఆధునిక టెక్నాలజీతో నేరస్తులను పట్టుకుంటున్నామని అన్నారు. ప్రతి జిల్లాలో ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యంతో ఎక్కువ సీసీ కెమేరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించామన్నారు. ఏలూరు రేంజ్ పరిధిలోని ఆరు జిల్లాల్లో క్రైం రేటును తగ్గిస్తున్నామన్నారు. ఏలూరు రేంజ్ పరిధిలో సీసీఎస్ బృందాలు ఉత్సాహంగా పనిచేస్తున్నాయని అన్నారు. వీరికి ఒక వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసి రైల్వే పోలీస్ సిబ్బందిని కూడా గ్రూపులో చేర్చి జిల్లాల పరిధిలో జరిగే నేరాలను గ్రూపుల్లో పెట్టి నేరాల అదుపునకు కృషి చేస్తున్నామన్నారు. జిల్లాలో మహిళల రక్షణ కోసం రక్షక బృందాలను ఏర్పాటు చేశామని వివరించారు. జిల్లా ఎస్పీ నరసింహకిశోర్, అడిషినల్ ఎస్పీలు ఎన్‌బీఎం మురళీకృష్ణ, ఏవీ సుబ్బరాజు, కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్, నిడదవోలు సీఐ పీవీజీ తిలక్, ఎస్సైలు టి.శోభన్‌కుమార్, సతీష్ పాల్గొన్నారు.



నిడదవోలు పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్క నాటుతున్న ఐజీ అశోక్‌కుమార్

ఇసుక లారీని ఢీకొన్న వ్యాన్


డ్రైవర్ మృతి

నల్లజర్ల: దూబచర్ల సమీపంలో శుక్రవారం ఉదయం లారీని వ్యాన్ ఢీకొన్న ఘటనలో వ్యాన్ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. అనంతపురం జిల్లా తాడిపర్తి మండలం చుక్కలూరు గ్రామానికి చెందిన శ్యామర్ల నరసింహులు (30) తన గ్రామం నుంచి దానిమ్మ కాయల లోడుతో వ్యాన్‌పై బయలుదేరాడు. రాజమహేంద్రవరం వస్తుండగా దూబచర్ల వద్ద ఆ వ్యాన్ ముందు టైరు పేలిపోయి అదుపు తప్పింది. తర్వాత డివైడర్‌ను దాటి కొవ్వూరు నుంచి ఏలూరు వైపు వస్తున్న ఇసుక లారీని ఢీకొంది. ఈ సంఘటనలో వ్యాన్ డ్రైవర్ నరసింహులు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య మహాలక్ష్మి, కుమారుడు మనోజ్ ఉన్నారు. గతంలో ఒకరి వద్ద డ్రైవర్‌గా పనిచేసిన నరసింహులు ఇటీవల వ్యాన్ కొనుగోలు చేసి కిరాయిలకు తిప్పుతున్నాడు. గురువారం రాత్రి ఒంటి గంట సమయంలో రాజమహేంద్రవరం వెళ్లి త్వరగా వచ్చేస్తానని చెప్పి ఇక్కడ మృత్యువాత పడటంతో కుటుంబ సభ్యులంతా శోకసంద్రంలో మునిగిపోయారు. మృతదేహాన్ని శవ పంచనామా నిమిత్తం తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ సోమరాజు తెలిపారు.



నరసింహులు (ఫైల్)

వైద్య ఖర్చులకు రూ.లక్ష విరాళం



రాజమహేంద్రవరం ఆసుపత్రిలో రాజేష్ కుటుంబానికి రూ.లక్ష సాయం అందజేస్తున్న కానిస్టేబుళ్లు

కొవ్వూరు: నిడదవోలు పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న టి.రాజేష్‌కు అనారోగ్యం కారణంగా కిడ్నీ ఆపరేషన్ చేయాల్సి ఉంది. ప్రస్తుతం రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతనికి వైద్య ఖర్చుల నిమిత్తం సహాయ ఫౌండేషన్ 2009 సివిల్ కానిస్టేబుళ్లు అంతా కలసి రూ.లక్ష సేకరించారు. ఆ సొమ్మును డివిజన్‌లో పనిచేస్తున్న ఆ బ్యాచ్ కానిస్టేబుళ్లు శుక్రవారం ఆసుపత్రికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు కిషోర్, రాజేష్, రమణ, శ్రీనివాస్, వెంకట రమణ, రామారావు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.